పెండింగ్ వేతనాలు చెల్లించాలి

హెంకిడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాంకిడి సీహెచ్‌సీ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషంటేకేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డాక్టర్ వినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని,చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, మహేష్, రాంజీ, రాహుల్, గౌరిబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా సన్నద్ధం కావాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల రైతు వేదికలో బుధవారం జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ శిక్షణ తరగతులకు హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో ఉంచాలని అన్నారు. పదో తరగతి చాలా ముఖ్యమైనదని చెప్పారు. విద్యార్థుల జీవితాలకు పునాది వంటిదని తెలిపారు. పదో తరగతి పూర్తి అయిన తరువాత ఉన్నత చదువుల దృష్ట్యా వివిధ మార్గాలను ఎంచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలనని చెప్పారు. ఎలాంటి ఒత్తిడి అపోహలు లేకుండా ఏకాగ్రతతో చదవాలని సూచించారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ వంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలకు ఇంకా 45 రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని, అదనపు తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్న ద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధి కారి సజీవన్, ఉపాధ్యాయుడు రమేశ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలను గుర్తించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు జిల్లాలు ఎనిమిది మండలాలలో అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని అభివృద్ధి పథకంలోకి తీసుకు రావాలని సెర్ప్ సీఈవో దివ్య అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియ కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో తెలంగాణ సమ్మిళత జీవనోపాధి కార్యక్రమం అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. అత్యంత వెనకబడిన నిరుపేదలను అభివృద్ధికిలోకి తీసుకు రావాలని, సుస్థిర జీవన ప్రమాణాలను పెంపొందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టరేట్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సుస్థిర జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను అధికారుల సమన్వయంతో అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఇంటి పన్ను వసూళ్లపై అధికారుల నజర్
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 49 శాతమే వసూలు
- మార్చి నాటికి వంద శాతం పూర్తి చేసేందుకు కసరత్తు

లక్ష్యం.. వంద శాతం..



ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులైన పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లపై కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీల్లో వంద శాతం పన్నులను వసూలు చేయాలని ఉన్నతా ధికారులు ఆదేశించడంతో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లలో సిబ్బంది నిమగ్నమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. దీంతో చెల్లింపులకు పంచాయతీ కార్యదర్శులు కొట్టుమిట్టాడు తున్నారు. పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ ఉద్యోగులకు నెల వారీగా వేతనాలు చెల్లింపు ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని అత్యవసర పనులకు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.

● జిల్లా వ్యాప్తంగా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 49 శాతం పన్నులు వసూలు అయ్యాయి. జిల్లాలో మొత్తం 335 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆసిఫాబాద్ మున్సి పాలీటిగా అప్‌గ్రేడ్ అయింది. 334 పంచాయతీలలో మొత్తం రూ. 5,80,00,299 పన్నులను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో రూ.2, 67,48,699 వసూలు అయ్యాయి. ఇంకా రూ.3,12,51,600 వసూలు కావాల్సి ఉంది. గడువు లోగా వంద శాతం పన్నులను వసూలు చేసేందుకు అధికారులు పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పన్నులను వసూలు చేయడంలో నిమగ్నమయ్యారు.

● 33 పంచాయతీల పరిధిలో..

జిల్లాలోని 33 గ్రామపంచాయతీల్లో 100 శాతం పన్నుల వసూలు ప్రక్రియ పూర్తయింది. ఆసిఫాబాద్ మండలంలో మూడు పంచాయతీలలో పన్నుల వసూలు పూర్తి కాగా బెజ్జూరులో 3, దహెగాంలో 3, కాగజ్‌నగర్‌లో 6, కౌటాలలో 2, సిర్పూర్(టి)లో రెండు, సిర్పూర్(యూ)లో రెండు, తిర్యాణిలో మూడు, వాంకిడి లో రెండు, రెబ్బెన, కెరమెరి, జైనూరు, చింతలమా నేపల్లి మండలాల్లో ఒక్కొక్క గ్రామ పంచాయతీలలో వంద శాతం పన్నుల వసూలు పూర్తయిందని అధికా రులు చెబుతున్నారు.

వంద శాతం వసూలు చేస్తాం..

- భిక్షపతి గౌడ్, ఆసిఫాబాద్ డీపీవో



ఈనెలఖరులోగా 100 శాతం పన్నుల వసూలు ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. జిల్లాలో రూ. 5.80 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ. 2.67 కోట్ల పన్నులు వసూలు చేశాం. ఇంకా రూ. 3.2 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉం ది. దీంతో ఇప్పటి వరకు 49 శాతం పన్నులు వసూలయ్యాయి. పన్నుల వసూలు కార్యక్రమాన్ని వేగ వంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ బాలేశ్వరస్వామి ఆలయంలో గత నెల 30వ తేదీ నుంచి రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ముగింపులో భాగంగా ఆలయంలో అర్చకులు శ్రీధర్ శర్మ, అజయ్, సత్యనారాయణల ఆధ్వర్యంలో స్వామి వారికి అన్నపూజ, షోడ ఉపచార పూజలు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, రాజోపచాములు, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన అదర్శ పాఠశాలలు, కస్తూరా గాంధీ విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఇన్‌చార్జి డీఈవో గమానియల్‌తో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, విద్యాశాఖాధికారులు, ఎస్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన మౌలిక వసతులు, తాగునీరు, మూత్రశాలలు, మరుగు దొడ్ల నిర్మాణం, బాలికల మూత్రశాలల నిర్మాణం, ప్రహరీ గోడల నిర్మాణం పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోగా పూర్తి చేయాలని సూచిం చారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాల నడు మ నాణ్యమైన విద్యా బోధ న అందించేందుకు ప్రభు త్వం అన్న చర్యలు తీసుకుంటుం దన్నారు. ఈ క్రమంలో జిల్లాలో మం జూరైన పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచిం చారు. సమావేశంలో విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త అబిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఎంఈవో హనుమంతు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రికవరీ చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీ నిధి బకాయిలు వంద శాతం రికవరీ చేయాలని స్త్రీ నిధి జోనల్ మేనేజర్ టీవీ రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో డీఆర్‌డీవో దత్తారావు, ఏపీడీ రామకృష్ణతో కలిసి మండల స్థాయి స్త్రీ నిధి బకాయిలపై ఏపీఎం, సీసీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 17 నాటికి 80 శాతంకు తగ్గకుండా ఉండాలని చెప్పారు. రికవరీ వేగంగా చేయాలని ఆదేశించారు. మార్చి నాటికి రికవరీ 95 శాతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీనివాస్, డీపీఎంలు అన్నాజీ, యాదగిరి, యశోద, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



ఆసిఫాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సవరించి కార్మికులకు, తెలంగాణకు న్యాం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడులుగా తయారు చేశారని చెప్పారు. కార్మికు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివాకర్, శ్రీనివాస్, మల్లేశం, ప్రవీణ్, దివాకర్, మోహన్, తుకారాం పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం స్వాధీనం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరందాజ్ థియేటర్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం, దేశీదారును స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు పట్టణంలో పలు చోట్ల దాడులు నిర్వహించామని, అక్రమంగా నిల్వ మద్యం, దేశీదారు నిల్వలు లభించినట్టు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన రత్నం శ్రీకాంత్, దివాకర్, అన్షుమాన్ సింగ్, యేనం రాజులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అక్రమంగా నిల్ల చేయొద్దని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపొద్దని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ జిల్లా పోలీసు అధికారులకు బ్రీత్ అనలైజర్‌లు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా వాహనాల తనిఖీ సమయంలో ఆధునిక బ్రీత్ అనలైజర్స్ ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటునానమని తెలిపారు.

కాగజ్‌నగర్‌లో వరంగల్ రీజినల్ డైరెక్టర్ పర్యటన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో బుధవారం వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కమిషనర్ అంజయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని డంప్ యార్డులో చేపడుతున్న బయో ఫెర్టిలైజర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ. శ్రీనివాస్, కమిషనర్ అంజయ్య, మేనేజర్ క్రాంతి తదితరులు ఉన్నారు.

ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సిర్పూర్ పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ యూనియన్ రిజిస్టర్(ఈ-966) ఆధ్వర్యంలో ఆదిలాబాద్ డీసీఎల్ అధికారికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గోగర్ల కన్నయ్య, యూనియన్ ఉపాధ్యక్షులు రాగులయ్య, యూనియన్ జనరల్ సెక్రటరి రాజన్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

● సంక్షిప్తం..

● వాంకిడి: జిల్లాలో బాలికల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. బ

- వాంకిడి జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎక్స్పర్ట్ టాక్స్ అనే కార్యక్రమం ఇంపాక్ట్ ఫౌండైషన్ సర్టిఫైడ్ ట్రైలర్ వడ్లూరి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● ఆసిఫాబాద్: సిద్దిపేట జిల్లా అక్కన్న పేట మండలం గోవర్ధనగిరి గ్రామ పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై పెట్టిన అక్రమ కేసును వెనక్కి తీసుకోవాలని ఈజీఎస్ ఎఫ్ఏ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, రహీం పాషా, అంకులు కోరారు.

● బెజ్జూరు: మారు మూల ప్రాంతాల యువత క్రీడల్లో సత్తా చాటాలని మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. మండల కేంద్రంలోని వాసవిక్లబ్ అధ్యక్షుడు శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంచారు.

● చింతలమానేపల్లి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తహసీల్దార్ మునావర్‌షరీఫ్ అన్నారు. మండలంలోని బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

● కౌటాల: మండల కేంద్రం నుంచి తుమ్మి డి హెట్టి వరకు రూ.8 కోట్లు, మొగడ్‌దగడ్ నుంచి తాటినగర్ వరకు రూ.2 కోట్లతో రోడ్ల మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండె విఠల్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

- కౌటాల మండలంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కృషి వల్లనే రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని బీజేపీ నాయకుడు విజయ్ అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు

● దహెగాం దహెగాం మండలం మాజీ ఎంపీపీ చౌదరి సురేష్ పెద్దనాన్న చౌదరి మల్లయ్య బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనప్ప బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎనిమిది మంది నిందితుల రిమాండ్



అనుమానితుల వద్ద స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన వన్య ప్రాణుల వేటాడే ముఠా వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకొని బుధవారం ఎనిమిది మందిని రిమాండుకు తరలించినట్టు ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ తెలిపారు. స్థానికంగా బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎఫ్‌డీవో వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న మధ్యప్రదేశ్ నుంచి కాజీపేటకు వెళ్లుతున్న జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా వెళ్లుతుండగా తమకు పక్కా సమాచారం రావటంతో ఈ ముఠా సభ్యులందరిని రైలులోంచి దించి తనిఖీ చేశామని చెప్పారు. ఫుట్ ట్రాప్స్, కత్తులు లభించినట్లు వివరించారు. ఈ మేరకు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామని అన్నారు. మరో ఎనిమిది మంది మహిళలు, చిన్నారులను జిల్లా చిన్నారుల సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు ఎఫ్‌డీవో తెలిపారు.ఈ సమావేశంలో డబ్ల్యుసీసీ అసిస్టెంట్ డైరెక్టర్ మిదివానన్ తదితరులున్నారు.

పులికి పొంచి ఉన్న ముప్పు

● అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు

కాసిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులుల సంచారం పెరిగిపోయింది. అదే స్థాయిలో పులులకు ప్రమాదం పొంచి ఉండడంతో అటవీ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సోమవారం కాగజ్‌నగర్ అటవీ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో మధ్యప్రదేశ్‌కు చెందిన వన్యప్రాణుల ముఠాను అదుపులోకి తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో కే 8 పెద్దపులి గత ఏడాది సెప్టెంబరులో మంచిర్యాల అటవీ డివిజన్‌లోకి వచ్చిన వెళ్లిన ఎస్ 12 పెద్దపులి తాజాగా బెల్లంపల్లి అటవీ డివిజన్‌పరిధిలో సంచరిస్తున్న బీ 1 పెద్దపులులు జనావాస ప్రాంతాల్లో సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. దీంతో ప్రజలను, పులులను సంరక్షించడం అటవీ శాఖ అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది.పులుల సంచారంతో పాటు వన్య ప్రాణులను వేటాడే ముఠాలు సైతం పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయని సమాచారం. సోమవారం కాగజ్‌నగర్‌లో అరెస్టు అయిన మధ్యప్రదేశ్‌కు చెందిన వన్య ప్రాణులను వేటాడే ముఠా ఐదు రోజుల క్రితం బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు సమాచారం. దీనిపై అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు నిఘా విభాగాన్ని పటిష్టం చేసి వలపన్ని చాకచక్యంగా ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వేటగాళ్ల బారి నుంచి పులులను సంరక్షించడానికి అటవీ శాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులులకు ఆవాసాలు కల్పించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. పోలీసు శాఖను సమన్వయం చేసుకుంటూ అటవీ అధికారులు పులుల రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

గుండెపోటుతో టిప్పర్ డ్రైవర్ మృతి

కాసిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ మైన్స్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవీంద్రసింగ్ (35) అనే యువకుడు బుధవారం గుండెపోటుతో మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. పోలీసులు కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మధ్య ప్రదేశ్‌కు చెందిన రవీంద్రసింగ్ కొన్నే ళ్లుగా ఓరియంట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దేవాపూర్ కంపెనీ క్వార్టర్‌లో ఒక్కడే ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం చాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలి పోయాడు. గమనించిన స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మక్కపై మక్కువ

జిల్లాలో యాసంగిలో 2,500 ఎకరాల్లో సాగు

బెజ్జూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ యాసంగి సీజనల్‌లో మొక్కజొన్న సాగుకే రైతులు మొగ్గు చూపారు. ఇతర పంటలను సాగు చేస్తే పెట్టుబడులు పెరగడం, ఆశించిన దిగుబడులు రాకపోవడంతో మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు కూడా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి రైతుల నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతుందని అధికారులు చెబుతున్నారు. సాగుకు పెట్టుబడి తక్కువ, విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు యంత్రాలతోనే పనులు చేయిస్తుండడంతో కూలీల అవసరం నామమాత్రమే. పంటకు నీటి తడులు తగ్గినా ఇబ్బంది ఉండదు. దీంతో రైతులు బెజ్జూరు, కాగజ్‌నగర్ మండలం, కౌటాల, కెరమెరి, దహెగాం తదితర మండలాల్లో మొక్కజొన్న పంట వేశారు.





భూగర్భజలాలు పెరుగడంతో..

వర్షాలతో భూగర్భజలాలు పెరుగడంతో ఈ యాసంగిలో మక్క సాగు చేసేందుకు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. మరోవైపు ప్రభుత్వం కూడా క్వింటాలు మక్కలకు రూ.2,200మద్దతు ధర ప్రకటించింది. 2019లో క్వింటాలుకు రూ. 1,550 నుంచి రూ. 1,750 వరకు ఉంది. ప్రభుత్వం క్రమంగా మద్దతు ధర పెం చుతూ వస్తోంది. ఒక్కోసారి ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా చెల్లించి పంటను కొనుగోలు చేస్తుండటంతో మక్కవైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా కోళ్లకు, పశువులకు దాణాగా మక్కలను ఉపయోగిస్తుండటంతో మక్కలకు అధిక డిమాండ్ పెరుగుతోంది.

ఎకరానికి 35 క్వింటాళ్లు..

మొక్కజొన్న పంట ఎకరానికి 35నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఖర్చులు పోగా ఎకరాకు రూ.45 వేలకు పైగా మిగులుతుంది. సీడ్ మక్క సాగు చేసిన రైతులు ముందస్తు ఒప్పందంతో సాగు చేస్తున్నారు. లోకల్ మక్కల కంటే రేటు అధికంగా వస్తుందని వ్యాపారులు అవగాహన కల్పించడంతో రైతులు అటు వైపు మొగ్గు చూపుతున్నారు. పంట కూడా సుమారు 70 రోజుల్లోనే చేతికి రానుండడంతో రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. పంట కూడా ఈ నెలాకరు వరకు చేతికొచ్చే అవకాశం ఉంటుంది. రైతులు కూడా వరి పంట సాగు పూర్తి కాగానే మక్క సాగు చేస్తున్నారు. మద్దతు ధర కూడా ఆశించిన మేరకు ఉండడంతో మండలంలో ఏటేటా మక్క సాగు పెరుగుతోందని రైతులు చెబుతున్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు చర్యలు

ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా జీఎం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియాలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలు ఏంటీ?

జీఎం: బెల్లంపల్లి ఏరియాలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ఏరియాలోని అధికారులు,కార్మికులు, సూపర్‌వైజర్లతో కలిసి సమష్టి కృషి చేస్తున్నాం. లక్ష్యం చేరుకుంటే ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఏరియాలో 2024-25 వార్షిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యం ఎంత?

జీఎం: బెల్లంపల్లి ఏరియాలో 2024-25 వార్షిక సంవత్సరంలో 38.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 28.56 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాం.

ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియాలో ఎంత మంది భూ నిర్వాసితులకు ఇప్పటి వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు..?

జీఎం: బెల్లంపల్లి ఏరియాలో 154 మంది భూ నిర్వాసితులను గుర్తించాం. అందులో ప్రస్తుతం 134 మందికి సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి)

జన జీవన స్రవంతిలో కలవండి

● లొంగిపోతే ప్రభుత్వం నుంచి అన్ని ప్రయోజనాలు అందేలా చూస్తాం ● రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మావోయిస్టు జాడి భాగ్య అలియాస్ పుష్ప కుటుంబీకులతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని జాడి భాగ్య అలియాస్ పుష్ప తల్లి మల్లమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రస్తుత స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వనం వీడి జనంలోకి మావో యిస్టులు రావాలని, లొంగిపోతే ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని , అనారోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యారని తెలిపారు. జన జీవన స్రవంతిలో కలిస్తే వారిపై ఉన్న రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామన్నారు. జాడి పుష్ప, వెంకటి దంపతులు 1999లో అజ్ఞాతంలోకి వెళ్లారని వారు లొంగిపోతే ప్రభుత్వం నఉంచి అన్ని ఏర్పాట్లు చేస్తామని తల్లి మల్లమ్మ, అన్న ఆవుల గంగారాంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ , బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

కడసారి చూసేందుకైనా ఇంటికి రండి

బతుకంతా అడవుల్లోనే ఎంతకాలం తిరుగుతారు... తాము ముసలోళ్లం అయ్యాము ఇంకా ఎంత కాలం బతుకుతామో తెలియదు. కడసారి చూసేందుకైనా ఇంటికి రావాలని మావోయిస్టు జాడి భాగ్య అలియాస్ పుష్ప తల్లి మల్లమ్మ విలేకరులతో వేడుకున్నారు. అనారోగ్యంతో చివరి దశలో ఉన్నానని తనకు అండగా ఉండేందుకు అడవిని వీడి ఇంటికి రావాలని కోరింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేగేటు వద్ద బుధవారం అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన నంది సురేష్ (24) కన్నాల ప్రాంతంలోని రైల్వే పట్టాలపై మృతిచెంది ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై అక్కడక్కడ గాయాలున్నాయని దీంతో అనుమా నాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మొరం తవ్వితే చర్యలు

బెజ్జూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని నీటి పారుదల శాఖ డీఈ భద్రయ్య అన్నారు. నలుగుపల్లి ప్రాణహిత కెనాల్ వద్ద మొరం తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఏఈలు ఉన్నారు.

రుణాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



సంచార వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లా మత్స్యశాఖ ద్వారా రాయితీతో మంజూరైన చేపల సంచార వాహనాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరా మహిళా శకిత పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకంలో క్యాంటీన్‌లు, మీసేవ, పెరటి కోళ్ల పెంపకం, కోళ్ల ఫారం, డైరీ ఇతర అనేక అంశాలను పొందుపరిచి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని కాగజ్‌నగర్ మం డలంలోని మహిళా స్వయం సహాయక సభ్యురాలు స్వరూపకు మహిళా శక్తి పథకం కింద మంజూరైన వాహనం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందాలని తెలిపారు. మహిళా సభ్యురాలు రూ.4 లక్షల డౌన్ పేమెంట్ కింద నగదు చెల్లిస్తే ప్రభుత్వం రూ.6 లక్షల రాయితీతో రూ.10 విలువల గల వాహనాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పంచాయతీ, మున్సిపల్, సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్, వైద్య, విద్య, గ్రామీణాభివృద్ధి, ఐసీడీఎస్ శాఖల అధికారులు, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ నులి పురుగుల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో నిఅన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 1-19 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని సూ చించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో 1,67,000 మంది పిల్లలకు ఈ నెల 10వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ రోజున అందని విద్యార్థులకు తిరిగి ఈ నెల 17న అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో వంద శాఖ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం, డీపీవో భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి వినతి

జైపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంనాయక్‌కు హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీపీసీ మాదిరిగా ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. సమస్యలను పరిష్కరించడంలో సింగరేణి యాజమాన్యం ముందుకు రాకపోతే నిరవధిక సమ్మెకు కూడా వెనకాడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, సాయికృష్ణ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యమని కార్పోరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని బుధవారం సందర్శించారు. ఉత్పత్తి లక్ష్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు అనే తేడా లేకుండా అందరు విధిగా ర క్షణ సూత్రాలను పాటించడం ద్వారా ప్రమాదాలు జరగవని తెలిపారు. విధి నిర్వహణలో తొందరపాటు మంచిది కాదని తెలిపారు. ప్రమాదాలు లేని సింగరేణి లక్ష్యంగా ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు సంబంధించి యాజమాన్యం చర్యలు చేపడుతూ ఆధునిక రక్షణ పరికరాలను వినియోగిస్తుందని అన్నారు. రక్షణ సూత్రాలను విస్మరించవద్దని తెలిపారు. విధి నిర్వహణతో పాటు బయట కూడా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేకే ఓసీ ప్రాజెక్టు అధికారిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి

రెబ్బెన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని జీఎం సెఫ్టీ(కార్పోరేట్) చింతల శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో బుధవారం తయన ఎర్యటించారు. గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయానికి చేరుకున్న ఆయనను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి మొక్కను బహూకరించారు. అనంతరం ఖైరిగూడ ఉపరితల గనిని పరిశీలించారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్టు ఉత్పత్తి, ఇతర అంశాలపై జీఎం శ్రీనివాస్‌తో అడిగి తెలుసుకున్నారు. అలాగే రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(సెఫ్టీ) రఘుకుమార్, ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

దసలి కాయలు వేలం

కౌటాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తలోడి పట్టుపరిశ్రమ లో రైతులు పండించిన పట్టు కాయలను అధికారులు బుధవారం వేలం వేశారు. హనుమ కొండ సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. తలోడి పట్టు పరిశ్రమ పరిధిలో అంబగట్ట, కోర్సిని, ముంజంపల్లి, కాటేపల్లి గ్రామాల్లో 180 మంది రైతులు 8 లక్షల పట్టుకాయలను పండించారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఛత్తీసగఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి ఐదుగురు వ్యాపారులు వచ్చారు. వెయ్యి కాయలకు రూ.4,450లకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇండియన్ ట్రస్సర్ హ్యాండి క్రాఫ్ట్ ప్రతినిధి నందకుమార్ కొనుగోలు చేశారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ అనసూయ మాట్లాడుతూ రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే ఏకైక పంట దసలి పట్టు పంటే అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భగవానులు, అసిస్టెంట్ డైరెక్టర్ పారవర్తి, సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు హార్టికల్చర్- సెరికల్చర్ జిల్లా అధికారి అబ్దుల్ నదీం, కాగజ్‌నగర్ సెరికల్చర్, హారికల్చర్ అధికారిణి సుప్రియా, చెన్నూరు సెరికల్చర్ అధికారి యూనస్, టీఏలు సోము, సిబ్బంది నర్సన్న రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

వాంకిడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ అమలు చేస్తామని చెప్పడం ద్వారా మాలలకు తీరని అన్యాయం చేశారని బీఎస్‌ఐ (బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర సంఘం, సిద్ధార్థ యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ కుమరం భీం జిల్లా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ రియాజ్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం దీనిపై పునరాలోచించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హంసరాజ్, రాజేంద్రప్రసాద్, పాండుజీ, పెంటు, రోషన్, అరుణ్, ప్రతాప్, రమేష్, మనోజ్, దీపక్, కార్తీక్, నాగేష్, దీపురత్న, నూతన్, జయపాల్, చింటు, రాజేశ్వర్, రాకేష్, రాందాస్, భీంరావు, చంద్రమని పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

108లో ప్రసవం

వేమనపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కలపేట, రాచర్ల గ్రామాలకు చెందిన ఇద్దరు గర్భిణులు బుధవారం వేర్వేరు 108 అంబులెన్స్‌లో ప్రసవించారు. ముల్కలపేటకు చెందిన ఉండవెల్లి దీపికకు పురుటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో సిబ్బంది ప్రసవం చేశారు. మగశిశువు జన్మించాడు. అనంతరం తల్లి, బిడ్డలను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే రాచర్ల గ్రామానికి చెందిన జీలపెల్లి సుమకు పురుటి నొప్పులు రావడంతో 108లో తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ జనార్ధన్‌రెడ్డి ప్రసవం చేయడంతో ఆడపిల్ల జన్మించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో వేమనపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కుటుంబీకులు అంబులెన్స్ సిబ్బం దికి కృతజ్ఞతలు తెలిపారు. పైలె ట్ ఇమామ్ షరీఫ్ పాల్గొన్నాడు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

కౌటాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల గిరిజన పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని చోట్ల టీచర్లు, సీఆర్టీలు విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కౌటాల మండలం గురుడుపేట గిరిజన పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీ అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావాడంతో ఆమెను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాని అన్నారు. ఐటీడీఏ పీఓ స్కూళ్ల పని తీరు, బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నార. మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ ఖమర్ హుస్సేన్, హెచ్‌ఎంలు అశోక్‌కుమార్, ప్రసాద్, ఎస్‌సీఆర్టీ పోచానీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కౌటాల మండలం కోయగూడ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు దేవయ్య పదవీ విరమణ పొందడంతో ఆయనను డీడీ సన్మానించారు.

యాసంగిలో ఆపకాల సాగు బాగు

మండల వ్యవసాయ అధికారి సంగీత



జన్నారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో ఆపకాలు సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల రైతులకు దిగుబడి పెరిగి ఆర్థికంగా లబ్ధిచేకూరుతుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : యాసంగిలో ఎలాంటి పంటలు సాగు చేస్తే బాగుంటుంది?

ఏవో : యాసంగిలో ఆపకాలు సాగు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. నీటి శాతం తక్కువ తీసుకోవడం వల్ల ఆపకాలు(పప్పు దినుసులు) సాగు అధికంగా జరిగితే దిగుబడి అత్యధికంగా వస్తుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి : ఆపకాలు సాగులో వచ్చే రోగాలు ఎలాంటివి ?

ఏవో : ఆపకాలు సాగులో ఎల్లో మైజోఫర్ వైరస్ అత్యధికంగా వ్యాపిస్తుంది. దీని వల్ల ఆపకాలు పంట ఎదగకుండా ఉండడం, పంట పచ్చబడి పోవడం జరుగుతుంది. దీని వల్ల పంట దిగుబడి తగ్గే అవకాశాలుంటాయి.

ఆంధ్రజ్యోతి : రైతులకు ఎలాంటి సూచనలు చేస్తారు?

ఏవో : పంటలను సాగు చేసే ముందు విత్తనశుద్ధి జరిగితే ఎల్లో మైజోఫర్ వ్యాప్తిని నివారించవచ్చు. విత్తనాలను సైకోడియాఆల్ఫోపాస్పేట్‌తో శుద్ధి చేస్తే దిగుబడి పెరగడమే కాకుండా ఎలాంటి రోగాలు రాకుండా అరికట్టవచ్చు.

ఆంధ్రజ్యోతి : పప్పుదినుసుల సాగు వల్ల ఎలాంటి లాభాలుంటాయి?

ఏవో : పప్పు దినుసుల సాగు కోసం తక్కువ నీరు ఉన్నా పండించవచ్చు. ముందుగా కాలిబాటలు తీసుకోవడం వల్ల మొక్క వృద్ధి చెందుతుంది. మొక్క దశలో ఉన్నప్పుడే పురుగు రాకుండా ఉండేందుకు నీమాయిల్‌తో స్ప్రే చేసుకోవాలి. వీటి వల్ల పంట దిగుబడి పెరుగుతుంది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి గ్రామంలోని దుబ్బపల్లిలో బుధవారం రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారి సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అగ్గి నుంచి అడవిని కాపాడుకుందాం



అడవిలో అంటుకున్న మంటలను ఆర్పేస్తున్న అటవీ శాఖ సిబ్బంది (ఫైల్)

- వేసవిలో అడవుల సంరక్షణకు ముందస్తు చర్యలు
- అగ్నిప్రమాదాల నివారణకు శాటిలైట్ సాయం
- మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్ల ఏర్పాటు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు

మానవతప్పిదాలే ప్రధాన కారణం...

ప్రతి వేసవి కాలంలో అడవిలో ఎక్కడో ఓ చోట అగ్గి రాజుకొని తగలబడిపోతోంది. అడవుల్లో చెట్లు రాల్చిన ఆకులు కింద పడి ఎండిపోతాయి. సహజంగా అంటుకునే గుణం మన అడవులకు లేదు. దారంట వెళ్లే వారు, పశువుల కాపరులు బీడీ, చుట్ట తాగి ఆర్పకుండా పడేస్తే ఎండిన ఆకులకు వెంటనే అంటుకుని మంటలు చెలరేగుతాయి. కొందరు వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి అడవిలోనే వండుకొని పొయ్యి ఆర్పకుండా వచ్చేస్తుండటంతో గాలి వీచినప్పుడు అగ్గి రాజుకుంటోంది. మానవ తప్పిదాల వల్లనే మంటలు వ్యాపించి అడవంతా బుగ్గి అవుతుందని అటవీ అధికారులంటున్నారు. చిన్న పాటి తప్పిదాల వల్లనే సహజ సంపదైన అడవులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

నెన్నెల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి సమీపిస్తున్న వేళ అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అడవుల్లో కార్చిచ్చు నివారణకు అధికారులు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అటవీ ప్రాంతంలో చెలరేగే మంటలను గుర్తించేందుకు శాటిలైట్ సాయం తీసుకుంటున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులతో వర్క్‌షాప్‌లు నిర్వహించి అటవీ సిబ్బందికి శిక్షణనిస్తున్నారు. అడవి తగలబడితే చేపట్టే చర్యల గురించి ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తున్నారు. ఫైరింజన్ చేరుకోలేని ప్రాంతాల్లో బ్లోయర్లు, ఫైర్ ఎక్సిస్టింగ్ సిలెండర్ల వినియోగం, ఆకులు కలిగిన కొమ్మలతో ఆర్పడం లాంటి విధానాల గూర్చి వివరిస్తున్నారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అటవీ మార్గాల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు పెడుతున్నారు. అడవుల్లో మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

అగ్గి రాజుకుంటే అపార నష్టం

మంచిర్యాల జిల్లాలోని నాలుగు అటవీ డివిజన్లలో 1564.93 చదరపు కిలోమీటర్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇంతే కాకుండా నెన్నెల, కన్నెపల్లి, జైపూర్, కోటపల్లి, తాండూరు, భీమారం, చెన్నూరు మండలాల్లో సుమారు 2 వేల హెక్టార్లలో నీలగిరి ప్లాంటేషన్లు ఉన్నాయి. అపురూపమైన వృక్షజాతులు, ఎన్నెన్నో జీవరాశులు ఈ అడవుల్లో నెలవై ఉన్నాయి. ఒక వేళ అగ్గి రాజుకొని అడవి తగలబడితే అపారనష్టం సంభవిస్తుంది. అడవికాలి బూడిదై పోతుంది. వన్యప్రాణులు అగ్నికి ఆహుతవుతాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. కాలిపోయిన అడవిలో కొన్నేళ్ల పాటు పచ్చదనం కానరాదు. కింద పడిన విత్తనాలన్నీ నాశనం కావడంతో ఏళ్ల తరబడి గడ్డికూడా మొలవని పరిస్థితి ఉంటుంది.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు

అటవీ ప్రాంతంలోని ఎడ్లబండ్ల దారులు, రోడ్లు, కాలిబాటలను గుర్తించి వాటికి ఇరువైపులు ఫైర్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎండిపోయిన ఆకలను, పుల్లలు,పొరకలను ట్రాక్టర్లు, బ్లోయర్‌ల సాయంతో 5 మీటర్ల వెడెల్పుతో నున్నగా చేస్తారు. దారి పొడవునా దగ్గరికి పోగేసిన ఆకులను నిప్పు పెట్టి కాల్చివేస్తారు. ఈ నున్నపు సరిహద్దుకు అవతల ఎవరైన బీడీ, సిగరేట్ తాగి ఆర్పకుండా పడేసినపుడు నిప్పంటుకుంటే అక్కడి నుంచి మంటలు ఫైర్‌లైన్ వరకు వెళ్లి నిలిచిపోతాయి. మధ్యలో 5 మీటర్ల మేర నున్నటి ఖాళీ ప్రదేశం ఉంటుంది కాబట్టి మంటలు అడవిలోకి వ్యాపించే అవకాశం ఉండదు. ప్రస్తుతం జిల్లాలోని నీలగిరి ప్లాంటేషన్లలో ఫైర్‌లైన్‌ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో అటవి డివిజన్లలో ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

నిమిషాల్లో సమాచారం..

అడవుల్లో అగ్ని ప్రమాదం జరిగితే ఆ ప్రాంతాన్ని గుర్తించి అక్కడికి వెళ్లే సరికే జరగాల్సిన నష్టం జరిగి పోతుంది. అలా జరగకుండా ఉండేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. 45 నిమిషాల్లో సిబ్బంది సంఘటన స్థలానికి చేరే విధానం, సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. మంటలు చెలరేగిన ప్రాంతాన్ని ఉపగ్రహం గుర్తించి సంబంధిత అధికారుల ఫోన్‌కు మెసేజ్ పంపిస్తుంది. నిమిషాల్లో అక్కడి బీట్ అధికారితో పాటు జిల్లా అధికారులకు అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతం, అక్కడికి వెళ్లే రూట్ మ్యాప్‌లు శాటిలైట్ ద్వారా చేరుతాయి. ఉన్నతాధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి అగ్నిప్రమాదం సంభవించిన చోటికి పంపిస్తారు. ప్రమాద తీవ్రత పెరగకుండా బ్లోయర్లతో ఎండు ఆకులను ఊడ్చేస్తారు. అవసరమైతే ఫైర్ ఇంజన్ల సాయం తీసుకుంటారు.





నీలగిరి ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్ , బ్లోయర్ వినియోగంపై శిక్షణ

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

గోగు సురేష్‌కుమార్, టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్, మంచిర్యాల రేంజ్



అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. వర్క్‌షాప్ నిర్వహించి ఫైర్ అధికారులతో అటవీ సిబ్బందికి ఈ పాటికే అవగాహన కల్పించాం. అటవీ సమీప గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నాం. అడవిలో ఉండే కాలిబాటలు, దారులకు ఇరు వైపుల ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపిస్తే వెంటనే సమాచా రం అందేలా సిబ్బంది మొబైల్ ఫోన్లలో ప్రత్యేక యాప్‌లను ఉపయోగిస్తున్నాం. ఉద్దేశపూర్వకంగా ఎవరైన అడవులకు నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నేరం రుజువైతే అటవి రక్షణ చట్టం ద్వారా నాన్ బేయిలబుల్ శిక్ష పడుతుంది. అడవులు, నీలగిరి ప్లాంటేషన్లలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి. అడువుల్లో మంటలను గుర్తిస్తే వెంటనే అటవీ, ఫైర్, పోలీస్ అధికారులకు విధిగా సమాచారం ఇవ్వాలి.

నాలుగు కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు...

(5వ పేజీ తరువాయి)

గామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జన్నారం మండలంలోని చర్లపల్లి, మొర్రిగూడ గ్రామాలను సైతం ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సమర్పించారు.

● నిబంధనలు అమలైతేనే..

జిల్లాలో కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కాబోయే గ్రామాల్లో నిబంధనలు వర్తిస్తేనే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. లేనిపక్షంలో న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో నిబంధనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో సమగ్రంగా విచారణ జరిపిన అధికారులు ఆ మేరకు ప్రతిపాదనలు అందజేశారు. ఒకవేళ ప్రభుత్వం అనుమతిస్తే ఇంతకాలం ఇతర పంచా యతీల పరిధిలో ఉన్న గ్రామాలు స్వతంత్ర జీపీలు మారుతాయి. ఆయా గ్రామాల్లో సొంతంగా పంచాయతీల పాలన ప్రారంభం కానుంది.

ఎలాంటి ఆదేశాలు అందలేదు..

వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

నిబంధనల మేరకు జిల్లాలోని నాలుగు పంచాయతీల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాము. ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తేనే కొత్త పంచాయతీలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో..

గురుకుల విద్యార్థులకు సీట్లు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీలో సీట్లు సాధించినట్లు దూట శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 మంది పరీక్షకు హాజరు కాగా 8 మంది సీట్లు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మణితేజ, విష్ణువర్ధన్, శ్రీనివాస్, నిఖిల్, షారోన్, సాయికుమార్, రోహిత్, ప్రీతం కుమార్ ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులను మిగితా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను ఎంఈఓ అలివేలు ఫోన్‌లు అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వర్మ, శ్రీనివాస్, రమేష్, రవీందర్, లక్ష్మీనారాయణ, శోభ, రఫీ, రాజేష్, అనిరుధ్, రవి, చంద్రశేఖర్, వామన్, సమేందర్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోల్ బెల్ట్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆదిజాంబవ మాదిగ యూత్ ఫెడరేషన్ నాయకులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, ప్ర ముఖ వైద్యుడు డాక్టర్ శరత్‌బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య మాదిగలు హాజరయ్యారు. ఈ నెల 7న చేపట్టే లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సారంగం, రాజనర్సు శంకర్, దాసరి రాజనర్సు, శంకర్, కిరణ్, సుమన్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేష్, ఎస్సై ప్రసాద్

నెన్నెల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తహసీల్దార్ సబ్బ రమేష్ అన్నారు. నెన్నెలలో నిర్వహిస్తున్న పూదరి సత్యనారాయణగౌడ్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుదవారం ఎస్సై ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. పల్లె క్రీడాకారుల ప్రతిభ ప్రపంచానికి చాటేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న పూదరి అంజన్న, నరేష్‌లను అభినందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 42 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ క్రీడాకారులు తోట సతీష్, మహేష్, సర్వర్‌పాష పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేసిన బడ్జెట్

శ్రీరాంపూర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అన్యాయం చేసిందని సీఐటీయూ మండల కన్వీనర్ రాజేశం అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మికరంగాన్ని ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. కర్షక లోకానికి సైతం కోతలు పెట్టడం దారుణమన్నారు. గ్రామాణాభి వృద్ధి, ప్రజా సంక్షేమం, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి రంగాలపై పెట్టే ఖర్చును తగ్గించడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీకేఎస్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, సమ్మయ్య, అశోక్, రమేష్, పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

వేమనపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ సమక్షంలో పలువురు పలువురు బీజేపీలో చేరారు. కల్మలపేట గ్రామానికి చెందిన జంబోజి ప్రభాకర్, దుర్గం వెంకటి, జాజులపేటకు చెందిన చౌదరి లచ్చన్న, మడే రాహుల్, కళ్యాణ్‌లు చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు మడే శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సీనియర్ నాయకులు పుల్లయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు అంజన్న, మధునయ్య, సతీష్, సమ్మయ్య పాల్గొన్నారు.

జాతర పోస్టర్ల విడుదల



జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్, నాయకులు

జైపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే బొక్కలగుట్ట గాంధారి ఖిలా మైసమ్మ జాతర పోస్టర్లను బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌లు విడుదల చేశారు. జైపూర్ రెండో ఎస్‌ఐ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాత ప్రశాంత్, ఆదివాసీ యువజన జిల్లా నాయకుడు అశోక్, నాయకపోడు కుల సంఘం నాయకులు సంజీవ్, తిరుపతి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

కన్నెపల్లి : బొక్కల గుట్ట గాంధారి ఖిలా మైసమ్మ జాతర పోస్టర్లను బుధవారం కన్నెపల్లిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐలు విడుదల చేశారు. జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పా ల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయక పోడు సేవా సంఘం జిల్లా జాయింట్ కార్యదర్శి ఐద శేఖర్, మండల అద్యక్షుడు కృష్ణ, మోహన్, సత్తయ్య, చంద్రయ్య, రాములు, శంకర్, సాయి, సంతోష్, బుజ్జన్న, సత్తయ్య, రవి, లక్ష్మణ్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



తాండూర్‌లో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నెన్నెల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా రంజక బడ్జెట్‌ను హర్షిస్తూ బీజేపీ నాయకులు బుధవారం నెన్నెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీచిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ. 12 లక్షల వరకు ఆదాయ పన్ను రద్దు, కిసాన్ క్రెడిట్ కార్డుపై రైతులకు రూ. 5 లక్షల రుణంతో ఉద్యోగులకు, మధ్యతరగతి ప్రజలకు, రైతులకు లబ్ధి చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు. ప్రధాని మోదీకి లభిస్తున్న జానాదరణ చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు లేనిపోని ఆరో పణలు చేస్తూ దర్నాలకు దిగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అద్యక్షులు అంగలి శేఖర్, నాయకులు శైలెం దర్‌సింగ్, కోట వంశీ, లింగంపల్లి మహేష్, గట్టు పవన్, దుర్గం రాజేష్, మదున్నయ్య పాల్గొన్నారు.

వేమనపల్లి : కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని రూ. 12 లక్షలకు పెంచడాన్ని హర్షిస్తూ వేమనపల్లి మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధూకర్, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, మదునయ్య, అజయ్, సమ్మయ్య, రాహుల్, అంజన్న, పుల్లయ్య, లక్ష్మణ్, సతీష్, వెంకటి పాల్గొన్నారు.

తాండూర్ : కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉండడాన్ని హర్షిస్తూ బుధవారం తాండూర్ ఐబీ కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ప్రకటన దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, కౌన్సిల్ సభ్యుడు రామగౌని మహీదర్‌గౌడ్, నాయకులు పాగిడి చిరంజీవి, పుట్ట కుమార్, మల్లేష్, శేఖర్, ఆనంద్, చందు, అశోక్, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పశువులను అడవిలోకి అనుమతించండి

● రోడ్డెక్కి అన్నదాతల ఆందోళన ● పశువుల కాపరిపై దాడి చేసిన బీట్ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్



ఇందన్‌పల్లిలోని రేంజ్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

జన్నారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌పరిధిలోని జన్నారం డివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్ అటవీ ప్రాంతంలోకి మేతకు పశువులను అనుమతించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రేంజ్ కార్యాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిపై పశువులతో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మంగళవారం ఇందన్‌పల్లి రేంజ్‌లో పనిచేస్తున్న బీట్ అధికారి రుబీనా పశువుల కాపరి గోపాల్‌పై అడవి వైపు పశువులను ఎందుకు తీసుకువస్తున్నావని గోపాల్‌పై దాడి చేసిందని వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో గల అటవీ ప్రాంతంలోకి పశువులను మేతకు అనుమతించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకు న్న జన్నారం ఎస్‌ఐ రాజవర్ధన్‌తో పాటు దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్‌ఐలు ఉదయ్ కుమార్, సతీష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అటవీ శాఖ అధికారులో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతు లు రాస్తారోకో విరమించారు. ఈ విష యంపై ఎఫ్ ఆర్‌వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎలాంటి దాడి చేయలేదని ఇప్పటికే 232,239 కంపార్టుమెంట్లలో పశువులను మేపేందుకు అనుమతులు ఇచ్చామని, పై అధికారులతో మాట్లాడి మరిన్ని కంపార్టుమెంట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మత్స్యకారుల జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

నస్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మత్స్యకారుల కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 8న జరిగే జాతీయ మహిళా సదస్సు పోస్టర్లను బుధవారం నస్పూర్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ రాందాస్ ఆవిష్కరించారు. మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బొడెంకి చందు మాట్లాడుతూ చాలా మంది మహిళలు మార్కెట్లలో, ఆయా కూడళ్ల రోడ్ల పక్కన చేపలను అమ్ముకుంటున్నారన్నారు. మహిళా సొసైటీలకు రూ. 10 లక్షల సబ్సిడీతో కూడిన రుణాలను అందించాలన్నారు. సదస్సుకు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. నాయకులు రాజన్న, రాజమల్లు, లచ్చన్న, కుమార్, పాల్గొన్నారు.

యువత సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యువత సృజనాత్మక తను పెంపొందించుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆలోచనలతో పారిశ్రామిక వేత్తలుగా రూపుదిద్దుకునే అవకాశం కల్పించబడుతుందన్నారు. కో ఆర్డినేటర్ ఏకాంబరం, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కు మార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

గర్మిళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హమాలివాడ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ప్రతి మంగళ, శనివారం అన్ని దేవాలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని హిందూ ఉత్సవ సమితి నిర్ణయించిం దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.



నాలుగు కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

- గెజిట్ నోటిఫికేషన్ విడుదలే తరువాయి
- ఆ తరువాతే పంచాయతీ ఎన్నికలు...?
- కార్పొరేషన్‌లో ఐదు పంచాయతీలు విలీనం

మంచిర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా నాలుగు పంచాయతీల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 311 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో ఐదింటిని ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. వాటి స్థానంలో కొత్తగా నాలుగు జీపీలు ఏర్పాటైతే మొత్తంగా 310 గ్రామపంచాయతీలతో జిల్లా నూతన స్వరూపం ఏర్పాటు కానుంది. జైపూర్, కాసిపేట, జన్నారం మండలాల్లో నాలుగు గ్రామాలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గ్రామ పంచా యతీలుగా మారిస్తే ఉపయోగకరంగా ఉం టుందని, ఈ విషయమై అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా పంచాయతీ అధి కారులు రెండు నెలల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జనాభా, దూరం ప్రాతిపదికన....

కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం అధికారులు జనాభా, దూరం ప్రాతిపదికన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలంటే సమీప పంచాయతీ నుంచి కొత్తగా ఏర్పాటు చేయబోయే జీపీ కనీసం రెండు కిలోమీటర్ల దూరం ఉండాలి. అలాగే ఆ గ్రామంలో కనీసం 500 జనాభా ఉండాలి. అప్పుడే గ్రామాలు గ్రామ పంచాయతీలుగా పదోన్నతి పొందేందుకు నిబంధనలు అనుకూలిస్తాయి. ప్రభుత్వం నిబంధనల మేరకు జనాభా, దూరం వంటి ప్రమాణాల ప్రకారం జిల్లాలో నాలుగు పంచాయతీలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అంద జేశారు.

- జైపూరు మండలంలోని గోపాల్‌పూర్ గ్రామం ప్రస్తుతం పొనూరు పంచాయతీలో ఉంది. ప్రస్తుత పంచాయతీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల డిమాండ్ల మేరకు ఈ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు.
- కాసిపేట మండలంలోని వరిపేటను పంచాయ తీగా ఏర్పాటు చేయాలని శాసన సభ ఎన్నికల వేళ అక్కడి ప్రజలు నిరసన తెలిపారు. వరిపేటను పంచాయతీగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో...

(తరువాయి 7లో)

కొత్త జీపీల ఏర్పాటు తరువాతే ఎన్నికలు...!

రాష్ట్రవ్యాప్తంగా కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ఆవశ్యకత ఉండగా, వాటి ఏర్పాటు తరువాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు ప్రభు త్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో కొత్త జీపీల ఏర్పాటు ఆ లోపే జరుగనుంది. పాత పంచాయతీలతో పాటు కొత్త జీపీల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలోని జైపూర్ మండలంలోని గోపాల్‌పూర్, కాసిపేట మండలంలోని వరిపేట, జన్నారం మండ లంలోని చర్లపల్లి, మొర్రి గూడ గ్రామాలను పంచాయతీలు మార్చాలంటూ ప్రభుత్వానికి అధికారులు ప్రతి పాదనలు పంపారు. పంచాయతీ ఎన్నికలలోపు ఆయా గ్రామాలను అధికారికంగా అప్‌గ్రేడ్ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావాల్సిసి ఉంది. అలాగే మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొ రేషన్‌గా అప్‌గ్రేడ్ చెందినందున అందులో సమీపంలోని ఐదు గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సరిపడా జనాభా కోసం హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూరు, నర్సింగాపూర్ పంచాయతీ లను అధికారులు కార్పొరేషన్‌లో విలీనం చేశారు.

చలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం ఈ నెల 20న చలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సెక్రటేరియట్ సభ్యుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల ను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడి చిపోతున్నా రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రూ. 4 వేల పింఛన్, యువ వికాసం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి హామీలను నెరవే ర్చాలన్నారు.

ఈ నెల 20న చేపట్టే హైద్రాబాద్‌లో చేపట్టే మహా ప్రదర్శన ధర్నాకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు తరలి రావాలన్నారు. అనంతరం చునార్కర్ శేఖర్ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు లాల్‌కుమార్, బ్రహ్మానందం, శ్రీనివాస్, మల్లన్న, జ్యోతి,జాఫర్, తిరుపతిరెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి క్యాంటీన్ ఏర్పాటు



మందమర్రిలో మహిళ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఇందిర మహిళశక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధ వారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న మహిళశక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం మండల సమాఖ్య ఆధ్వర్యంలో క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. టీ, టిఫిన్‌లు, భోజనం అందుబాటులో ఉంటాయని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఐకేపీ ఏపీఎం లలితకుమారి, ఏపీవో రజియా సుల్తానా, వీవోఏలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ కా ర్పొరేట్ కంపెనీల ప్రభుత్వమని, ఆదానికి వేలకోట్లు రుణమాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఎందుకు వేతనాలను పెంచడం లేదన్నారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారానికి ఎలాంటి మార్గం చూపడం లేదని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణకు చర్యలు లేవన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కలీందర్‌ఆలీఖాన్, పౌలు, రాయమల్లు, మహేష్, ప్రకాస్, సాయి, తేజ, సాగర్, జాఫర్, రాజేశం, సురేందర్, సయ్యద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఇందారం భేష్



ట్రైనీ మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్ ఆఫీసర్‌లను సన్మానిస్తున్న గ్రామస్తులు

జైపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో ఇందారం గ్రామం ఎంతో మెరుగ్గా ఉందని ట్రైనీ మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్ ఆఫీసర్‌లు నితీష్‌రెడ్డి, ప్రభాకర్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇందారం గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల స్థితిగతులు, ఉపాధి హామీపనులతో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఏవిధంగా ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో వీధులు పరిశుభ్రంగా ఉండడంతో అధికారులను, పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. ఉపాధిహామీలో గ్రామంలో ఎంతో మంది కూలీలు ఉపాధి పొందుతున్నారని ఈజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రైనీ మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్ ఆఫీసర్‌లను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో బాలయ్య, ఏపీఎం రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సుమన్, సత్యనారా యణ, సురేష్ పాల్గొన్నారు.

కాటమయ్య సురక్ష కిట్లపై శిక్షణ

చెన్నూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ఆస్నాద గ్రామంలో కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్ అధికారులు కాటమ య్య రక్షణ కిట్లపై బుధవారం శిక్షణ ఇచ్చా రు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ హరి మాట్లా డుతూ చెన్నూరు నియోజకవర్గానికి చెందిన 60మంది గీత కార్మికులకు చెట్టుపై నుంచి పడకుండా శిక్షణ ఇప్పించినట్లు తెలి పారు. వీరికి త్వరలోనే కాటమయ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో 9మంది శిక్షకులు, బీసీ వెల్ఫేర్ వార్డెన్‌అహ్మద్, కాటమయ్య సురక్ష కార్పొ రేషన్ డీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టోకెన్ లేకుండా పత్తి కొనాలంటూ

జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో



చెన్నూరులో రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చెన్నూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి టోకెన్‌లు లేకుండా నేరుగా పత్తి మిల్లులోనే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయాలని కోరుతూ రైతులు బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లు నిర్వహిం చేందుకు రోజుకు 40 పత్తి వాహనాలకు మాత్రమే టోకెన్‌లు ఇస్తున్నారని, ఇలా అయితే మిగితా రైతులందరు ఎక్కడకు పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్ప టిలాగే నేరుగా మిల్లులో కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు.

రైతులు రహదారి పై ధర్నా చేయడంతో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. పోలీసులు అక్క డకు చే రుకుని రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ రైతులు వినలేదు. దీంతో సీపీవో రైతుల వద్దకు వచ్చి ఎలాంటి టోకెన్‌లు లేకుండా పత్తి కొనుగోళ్లు చేపడతామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- అవగాహన కార్యక్రమంలో రవూఫ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్

నస్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నాషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన, మత్తుపదార్థాల నివారణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఈ సందర్భంగా విద్యా ర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితం నాశనం అవుతుం దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యాలో రాణిస్తూ, ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆనంద్, నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రాథోడ్ మనీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూరులో జిన్నింగు మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని పత్తిమిల్లు, కిష్టంపేటలోని వరలక్ష్మీ ఇండస్ట్రీస్, ఆదిశంకరాచారి జిన్నింగు మిల్లులు, కోటపల్లి మండల కేంద్రంలోని జీఆర్‌మిల్లు, పారుపెల్లిలోని నవదుర్గ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. క్వింటాలు పత్తికి రూ. 7521 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. రైతులు పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యత ప్రమాణాల ప్రకారం పత్తి తీసుకువచ్చి మద్దతు షధర పొందాలన్నారు. సీసీఐ కేంద్రాల్లో నిల్వ ఉన్న పత్తి గింజలను త్వరగా తరలించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల న్నారు. పత్తిని విక్రయించేందుకు సీసీఐకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలు కల్పించాలని, దళారులను నమ్మిమోసపోకుండా సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి రైతులు లబ్ధిపొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ సంబంధిత అధికారులు, జిన్నింగు మిల్లుల యాజమానులు, సీసీఐ నిర్వహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సీతారాంపల్లి శాఖ

- రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు



సమావేశంలో మాట్లాతున్న రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు

నస్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాలుగా ఖాతాదారులు అందించిన సహకారాలతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి శాఖ ప్రగతి పథంలో నడుస్తుందని రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు అన్నారు. నస్పూర్ పట్టణం సీతారాంపల్లి శాఖ బ్యాంక్‌లో బుధవారం 'కాఫీ విత్ కస్టమర్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మనోహర్ రావు మాట్లాడుతూ ఖాతాదారులు తమ తమ ఆర్థిక అవసరాలన్నింటికి రుణాలు తీసుకుని అభివృద్ధి చెందారన్నారు. సీతారాం పల్లి శాఖ ద్వారా 300 కోట్లలకు పైగా వ్యాపారం నిర్వహించామన్నారు. తెలంగాణ గ్రా మీణ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ 7.6 శాతం నుంచి 8.1 శాతం వరకు లభిస్తుందన్నారు. ఇతర ప్రభుత్వ రంగం బ్యాంకుల కన్న తమ శాఖల సేవలను ప్రజలు పొందుతూ ఇక్కడ విలువైనా పొదుపులను చేస్తున్నారన్నారు. ఈ సమా వేశంలో బిజినెస్ చీఫ్ మేనేజర్ రవి కిషొర్ రెడ్డి, సీనియర్ మేనేజర్ ఆపరేషన్స్ రఘువీర్ శర్మ, స్థానిక బ్రాంచీ మేనేజర్ నరసింహాస్వామి, ఫీల్డ ఈఫీసర్లు హుస్సేన్, రవి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యం...

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలిన రోడ్డు, మధ్యలో వేసి సెంట్రల్ లైటింగ్ పోల్స్

నస్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయం సమీపం నుంచి రాయల్ ఫంక్షన్‌హాల్ వరకు నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులను అర్థాంతరంగ నిలిపివేశారు. రోడ్డు వెడల్పు, నిర్మాణ పనులు, మధ్యలో 14వరకు సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటుచేసి మిగిలిన పనులు పూర్తి చేయకుండా ఆపివేశారు. దీంతో వాహనాల రాకపోకల కారణంగా కంకర తేలి వాహనదారులు, చుట్టు పక్క వ్యాపారులు, పాఠశాల విద్యార్థులు నానాఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రోడ్డుపై వాహనాలు వెళ్లే సమయంలో విపరీతమైన దుమ్ము వస్తుందని స్థానికులు చెబుతున్నారు. తేలిన కంకరపై రోడ్డుపై ప్రయాణించడం కష్టతరంగా మారడంతో వాహనాల చోదకులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీయూ ఎఫ్ఐడీసీ రూ. దాదాపు 50 లక్షల నిధులతో దాదాపు 320 మీటర్ల పొడవునా రోడ్డు వెడల్పుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కొరకు నిధులు మంజూరైయ్యాయి.

దుమ్ముతో ఇబ్బంది...

నెల రోజుల కిందట పనులు చేపట్టి రోడ్డు వెడల్పు చేసి కంకర వేసారు. అంతే కాకుండా మధ్యలో సెంట్రల్ లైటింగ్ కోసం స్తంభాలు వేసారు. పనులు 25రోజులు ఆపివేయడంతో వాహనాల రాకపోకలకు కంకర తేలింది. దుమ్ము విపరీతంగా వస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ కోసం 14 లైటింగ్ పోల్స్ కోసం దిమ్మెలను ఏర్పాటుచేసి స్తంభాలను వేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వెలుగుతున్నాయా లేదా అని టెస్ట్ కూడా చేశారు. నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, నాగార్జున కాలనీ, న్యూ నాగార్జున కాలనీలకు చెందిన సింగరేణి కార్మికులు విధులు నిర్వహణకు ఈ రోడ్డు మార్గం ద్వారా చాలా మంది ప్రయాణిస్తారు. కంకర తేలిన రోడ్డుపై వేళుతున్న సమయంలో ద్విచక్రవాహనాల టైర్లకు కంకర రాళ్లు గుచ్చుకుని పంచర్లు అవుతున్నాయి. దీంతో విధులకు ఆలస్యం అవుతుందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కంకర తేలిన రోడ్డు పై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలైన సంఘటనలు న్నాయి. ఇదే రోడ్డు పక్కన మంగళ, శనివారాల్లో రెండు రోజుల్లో వారసంత జరుగుతుంది. రోడ్డు పక్కనే చిరు వ్యాపారులు వివిధ రకాల అమ్మకాలు చేయడం, రోడ్డుపై ప్రయాణించే వా హనాలతో దుమ్ముతో వ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడాల్సివస్తోంది.

తొందరగా పనులు పూర్తి చేయాలి

- నవీన్ కుమార్



రోడ్డు నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయాలి. వాహనాలు వెళ్లిన సమయంలో దుమ్ముదూళి విపరీతంగా వస్తోంది. దుమ్ము కారణంగా షాపుల్లో టేబుళ్లను, ఇతరాత్ర పర్నిచర్‌ను రోజుకు మూడు, నాలుగు సార్లు శుభ్రం చేయాల్సి వస్తోంది. వాహనాల టైర్ల కిందపడిన రాళ్ళు వేగంగా ఎగిరిపడుతు న్నా యి. తొందరగా పనులు పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుంది.